క్లుప్తంగా

16న మండల సర్వసభ్య సమావేశం

కొత్తపట్నం: ఈ నెల 16న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.సుజాత తెలిపారు. 16న మధ్యాహ్నం ప్రారంభమై సాయంత్రానికి ముగిస్తామన్నారు. ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాల్సిందిగా కోరారు.

విశ్వనాథునికి నృత్య నీరాజనం రేపు

ఒంగోలు టౌన్: స్థానిక సివీఎన్ రీడింగ్ రూం ప్రాంగాణంలో శనివారం చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులతో కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు నృత్య నిరాజనం ద్వారా ఘనంగా నివాళి అర్పించనున్నట్లు కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, అకాడమీ నిరాంహకులు త్రోవగుంట చందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన ఆణిముత్యాల్లాంటి పాటలకు 50 మంది చిన్నారులు నృత్యాలు చేస్తారని వివరించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్‌కుమార్

ఒంగోలు రూరల్: త్రోవగుంటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పీఎంఎస్ఎంఏ వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ వైద్యులు, ఏఎన్ఎంల సూచనలు పాటించాలని కోరారు. బిడ్డ ఎదుగుదల, తల్లి హిమోగ్లోబిన్ శాతం ఎప్పటికప్పుడు పరీక్ష చేయించుకోవాలన్నారు. ఏఎన్ఎం వి.రోహిణి కుమారి, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సరుకుల విషయంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం లేదా ప్రజలు కొనుగోలు చేసే సరుకుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ సాయికుమార్ అన్నారు. గురువారం స్పందన భవనంలో సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై జిల్లా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో జాయింట్ డైరెక్టర్ వివిధ భారతీయ నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఆయా ప్రమాణాలను ఏ ఈవిధంగా పాటించాలి తెలుపుతూ సంస్థ ఏర్పడినప్పటి నుంచి జరిగిన ప్రగతి వివరించారు. డీఎస్ఓ ఉదయభాస్కర్, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మ చౌదరి మృతికి సంతాపం

ఒంగోలు: రాష్ట్ర బ్యాడ్మింటన్ మాజీ కార్యదర్శి, సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అంకమ్మ చౌదరి మృతికి లార్డ్ కృష్ణా షటిల్ అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. క్రీడాభివృద్ధికి ఎనలేని సేవ అందించారని, పలు అంతర్జాతీయ, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన అంకమ్మ చౌదరి మృతి బ్యాడ్మింటన్ క్రీడాలోకానికి తీరని లోటుగా పేర్కొన్నారు.

ట్రాఫిక్ జామ్‌కు చెక్

- బస్‌బేల కోసం 15 ప్రదేశాల గుర్తింపు
- దాతల సహకారంతో బస్ షెల్టర్ల నిర్మాణానికి ప్రయత్నాలు


బస్ బేల కోసం పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాస్ తదితర అధికారుల బృందం

ఒంగోలు టౌన్: నగరంలో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. జనాభా పెరగడంతో పాటు విద్య, వైద్యం, వ్యాపారాల కోసం ప్రతిరోజూ సుమారు 50 వేలమంది వరకు నగరానికి వచ్చిపోతుంటారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిపోయే ప్రయాణికులతో పాటు ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం కోసం ఆర్టీసీ బస్సులను ఎక్కడ పడితే అక్కడ ఆపుతున్నారు. దీంతో నగరంలో తరచుగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. అలాగే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆఫీసులకు వెళ్లి వచ్చే ఉద్యోగులు, కాలేజీ బస్సులతో ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. ఏళ్ల తరబడి వేధిస్తున్న ఈ సమస్యకు త్వరలో చెక్ చెప్పనున్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ చైర్మన్ అయినటువంటి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాస్, ఆర్టీసీ, మున్సిపల్ అధికారులతో కలిసి గత మూడు రోజుల నుంచి నగరంలో పర్యటించారు. చర్చి సెంటర్, కలెక్టరేట్, నెల్లూరు బస్టాండ్, కరెంట్ ఆఫీస్, డీమార్ట్, సౌత్ బైపాస్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం తదితర ప్రాంతాలతో పాటు తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్న 15 ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో బస్‌బేలను నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నారు. నగరంలో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు బస్‌బేలను ఏర్పాటు చేసేందుకు గాను అవకాశం ఉన్న చోటల్లా బస్ షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నామని ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ శ్రీనివాసరావు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి వారి ఆదేశాల మేరకు తదుపరి ప్రక్రియను మొదలు పెడతామన్నారు. ఈ బస్ బే దగ్గరే బస్సులు ఆపేలా ఆర్టీసీ డ్రైవర్లకు సూచిస్తున్నామన్నారు. షెల్టర్ నిర్మాణం కోసం అవసరమైతే దాతల సహకారం తీసుకుంటామని మోటారు వెహికల్ ఎన్‌స్పెక్టర్ జగదీష్ తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ షాహినా బేగం, మునిసిపల్ ఇంజినీర్ రామకోటయ్య పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వీడండి

- వసూలు చేయకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవు
- పాత గుంటూరు రోడ్డులోని వీ–గ్రాండ్ హోటల్‌కు రెడ్ నోటీసులు జారీ
- వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు


హెచ్చరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన 3వ డివిజన్ కార్పొరేటర్ గండు ధనలక్ష్మి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలో ఇంటి పన్ను, కుళాయి పన్నులు వసూలు చేయటంలో వార్డు సచివాలయాల సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని పొనుగుపాటి వారి కాలనీ వార్డు సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గండు ధనలక్ష్మితో కలిసి సమీక్ష నిర్వహించిన.. కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, కుళాయి పన్నులు ఎందుకు వసూలు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కూడా మండి పడ్డారు. అక్కడ నుంచే వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. ఇంటి పన్ను, కుళాయి పన్నుల వసూలు జాబితా తయారు చేయనందున సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారిని గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కూడా అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు. అధిక సంఖ్యలో పన్నులు పెండింగ్‌లో ఉన్న పాత గుంటూరు రోడ్డులోని వీ–గ్రాండ్ హోటల్‌కు రెడ్ నోటీసులు జారీ చేయాలని కూడా ఆదేశించారు. అనంతరం ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ పన్నులు పెండింగ్‌లో ఉన్న నెల్లూరు బస్టాండ్‌లోని మోహన్ లాడ్జి, హనుమాన్ లాడ్జిలను సందర్శించి యాజమాన్యాలతో పన్నులు చెల్లించాలని సూచించారు. నగరంలోని అన్ని వార్డు సచివాలయాలలో పెండింగ్‌లో ఉన్న పన్నులు జాబితాలను సిద్ధం చేయాలని నగర పాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను, రెవిన్యూ ఆఫీసర్లను ఆదేశించారు. సకాలంలో పన్నులు చెల్లించి ఒంగోలు నగర పాలక సంస్థ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. 3వ డివిజన్ కార్పొరేటర్ గండు ధనలక్ష్మి, సిబ్బంది రాధా, అమ్మిరెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

ఒంగోలు సబర్బన్: నగరంలో కార్మికులు పారిశుద్ధ్యాన్ని నిర్వహిస్తున్న తీరును గురువారం కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. పొనుగుపాటి వారి కాలనీ, విరాట్ నగర్, శ్రీరామ్ కాలనీ, కరుణా కాలనీలతో పాటు నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి రోజూ ఇంటి నుంచి చెత్త సేకరణను తప్పకుండా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణ విషయంలో ఆటోలు వెళ్ళలేని ప్రాంతాల్లో తోపుడు బళ్ళతో చెత్త సేకరణ చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. డ్రెయిన్లను తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆదేశించారు.

శివం ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం


సాయం అందిస్తున్న అదనపు ఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు: శివం ఫౌండేషన్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకం అని ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్ బాబు అన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో శివం ఫౌండేషన్ స్థాపించి 5 సంవత్సరాలు పూర్తి కావడంతో శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి కుమార్తె నిత్య భ్రమరాంబ చేతులమీదుగా భారీ కేక్ కట్ చేశారు. అనాథలు, యాచకులుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ నిత్య అన్నదాన సంచార వాహనం ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో 220 రోజులుగా నిరంతరాయంగా అనాథలకు అన్నదానం చేయడం మంచి పరిణామమంటూ గొల్లపూడి శ్రీహరిని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించామని 220 రోజులుగా సేవ చేయడం తృప్తి కలిగిస్తోందన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ సాటి మనిషికి సహాయ పడితే లభించే తృప్తి మరో పనిలో ఉండదని ఈ కార్యక్రమం నిరూపిస్తుందన్నారు. మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవ, సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం



ఒంగోలు: ప్రజా న్యాయ పీఠ ప్రక్రియలో కక్షిదారులే నిజమైన న్యాయమూర్తులు అని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రాయసం శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కక్షిదారులు కోరుకునేది తమకు అనుకూలమైన పరిష్కారమే కానీ, వివాదం కాదన్నారు. జిల్లాలోని 36 న్యాయస్థానాల్లో 52 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 32వేల కేసులు ప్రజా న్యాయపీఠ ప్రక్రియ ద్వారా పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. ఈనెల 11న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూ.64 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ శంకుస్థాపన


ఓవర్ హెడ్ ట్యాంక్‌కు శంకు స్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ కన్వీనర్

చీమకుర్తి: సంతనూతపాడు మండలం వేములపాడు సచివాలయం పరిధిలో మట్టిపాడు, గొర్లమిట్ట గ్రామాలకు తాగునీటిని అందించేందుకు అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను రూ.64 లక్షలతో నిర్మించేందుకు ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా గురువారం శంకుస్థాపన చేశారు. దానితో పాటు స్థానిక గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సైడు కాలువలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ కె.రమణయ్య, మండవ వెంకట నారాయణ ఆధ్వర్యంలో వారిని సత్కారించారు.

బడ్జెట్‌ను పునః పరిశీలన చేయాలి

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లను పునః పరిశీలన చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కేవీవీ ప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి, ఉపాధి హామీ పథకానికి తగినన్నీ నిధులు కేటాయించలేదని ధ్వజమెత్తారు. ఆయా పథకాలతో పాటు ఆహారానికి సంబంధించిన విషయంలో కూడా నిధులు నామమాత్రంగా కేటాయించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరు రంగారావు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు ఈ బడ్జెట్ అనుకూలంగా ఉంది తప్ప సామాన్యులకు నడ్డి విరిచేలా ఉందని మండిపడ్డారు.

దేవరపాలెం గడప గడపలో విశేష ఆదరణ


నాడు–నేడు అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: దేవరపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బూచేపల్లి కుటుంబానికి స్వగ్రామం కావడంతో స్థానిక గ్రామంలోని సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులందరిలో అభిమానం వెల్లువెత్తింది. ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులతో మాట్లాడి ఏఏ ఇంట్లో ఎంతెంత నగదు వారి వ్యక్తిగత ఖాతాలలో జమయిందో కూడా వివరించారు. ప్రతి ఇంట్లోకి ప్రవేశించే ముందు స్థానిక మహిళలు హారతులతో స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ అండగా నిలబడి జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సర్పంచ్ కె.వరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు చిన్నపురెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పులి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తొలుత గ్రామంలోకి పార్టీ జెండాలతో హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమం మధ్యలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.40 కోట్లతో నిర్మిస్తున్న నాడు–నేడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి మరియు రూ.60 లక్షలతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మాజీ వైఎస్ ఎంపీపీ బూచేపల్లి నాగిరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా..


నాలుగున్నరేళ్ళుగా నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్


అంగన్‌వాడీ భవనం కోసం నిర్మాణం

ఒంగోలు రూరల్: కరవది, చేజర్ల మార్గంలో గత నాలుగేళ్ళ క్రితం నాటి ప్రభుత్వం ఆగమేఘాలపై 5 షాపులతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను హడావిడిగా నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తూ నాసి రకం రాయితో క్యూరింగ్ అంతంత మాత్రం చేసి ప్లాస్టరింగ్ చేయకుండా, మౌలిక సదుపాయాలు లేకుండా నిర్మించి వదిలివేసి ఇప్పటికి నాలుగేళ్ల దాటింది. జన సంచారం లేని రోడ్డు మార్జిన్‌లో ఎవరు కొనుగోలు దారులు లేని ప్రదేశంలో ఈ నిర్మాణం రూపొందించంతో నిరుపయోగంగా మారింది. అలాగే కరవది, ఒంగోలు రోడ్డు మార్గం చేజర్ల, ఒంగోలు రోడ్డు మార్గం జంక్షన్‌లో ప్రధాన మురుగు కాలువపై శ్లాబు వేసి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎలాంటి గోడలు నిర్మించకుండా గాలికి వదిలేశారు. ఇది కూడా నిరూపయోగంగా మారింది.

ఇసుక తవ్వకాలు రద్దు చేయాలి


డీఆర్ఓకు వినతిపత్రం అందిస్తున్న సంస్థ సభ్యులు

ఒంగోలు అర్బన్: ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ జలాశయంలో ఇసుక తవ్వకాలను రద్దు చేయాలని కోరుతూ పర్యావరణ పరిరక్షణ సంస్థ ఛైర్మన్ వీరభద్రాచారి ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసును ప్రకాశం భవనంలో కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గుండ్లకమ్మలో ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని, రూ.700 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు ద్వారా సీజన్ పరంగా వ్యవసాయ అవసరాలకు నీటిని అందించాలని కోరారు. మేట పేరుతో ఇసుక దోపిడీ జరుగుతోందని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మోజెస్, మధు, శ్రీనివాసరావు, శివ, కుమార్‌రాజ తదిరతరులున్నారు.

ఘనంగా క్విస్ విద్యాసంస్థల రజతోత్సవం


రజతోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేస్తున్న నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి


సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు: క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవ కార్యక్రమం గురువారం స్థానిక క్విస్ కాలేజీలో ఘనంగా జరిగింది. క్విస్ విద్యాసంస్థల సెక్రెటరీ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి పుట్టిన రోజు కూడా కావడంతో ఆయన అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు క్విస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నిడమానూరి నాగేశ్వరరావు, కాలేజీ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, కాలేజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీ శంకర్, ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, షార్ సైంటిస్ట్ బీవీ సుబ్బారావు, డీఆర్‌డీఓ సైంటిస్ట్ యువనరాణి తదితరులు కళ్యాణచక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కాలేజీకి జాతీయ స్థాయి గుర్తింపు దక్కడంతోపాటు ఎన్‌బీఏ టైర్ 1, నాక్ ఏప్లస్ లభించడం, అత్యధిక ఇన్‌టేక్ విద్యార్థులతో ఇంజినీరింగ్ విద్యను అందించగలగడం తమకు లభించిన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యదర్శి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ క్విస్ విద్యాసంస్థలను ఒక ఉన్నత ఆశయంతో స్థాపించామని, పాతికేళ్లుగా ఇంజినీరింగ్ విద్యను ఉన్నత ప్రమాణాలతో అందిస్తున్నామన్నారు. అతిథులు మాట్లాడుతూ క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు నేడు అనేక దేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో కొనసాగుతున్నారని, అటువంటి స్థాయికి వారు చేరుకునేందుకు సూర్యకళ్యాణ్ చక్రవర్తి గ్లోబల్ విజన్‌తోపాటు, లీడర్‌షిప్ కారణమంటూ కొనియాడారు. అనంతరం కాలేజీలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడ, సాంస్కృతిక పోటీలు, ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

వరికోతలు ప్రారంభం


వరి కోతకు సిద్ధంగా పొలం


నూర్పిడి అనంతరం బస్తాలకు ఎత్తుతున్న ధాన్యం

ఒంగోలు రూరల్: పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. నాణ్యమైన వంగడాలను ఒంగోలు మండల వ్యవసాయ అధికారి రైతు పరిశోధన సంస్థ వారి నుంచి రైతులకు ఆర్‌బీకేల ద్వారా అందజేయడంతో మంచి లాభాలు గడించే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నాయి. గురువారం మండలంలోని కొందరు రైతులు ముందస్తుగా వేసిన తమ వరి క్షేత్రాల్లో వరి కోతలు ప్రారంభించారు. వారు వేసిన 92 రకం మంచి దిగుబడులను అందజేసింది. వెంకటేశ్వర్లు అనే రైతు తమ వరి పొలంలో పంట నూర్పిడి చేస్తూ సాక్షితో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసినా, తెగుళ్ళు వాటిల్లకుండా వాడాల్సిన ఎరువులను ఒంగోలు ఏవో సూచించారని, సస్య రక్షణకై మందులు సిఫారస్సు చేశారన్నారు. ఎకరా మాగాని పొలంలో వ్యవసాయ శాఖ సూచనల మేరకు 30 బస్తాలకు పైగా ప్రస్తుతం దిగుబడి అయిందని గతంలో ఈ మాత్రం దిగుబడి లేదని స్పష్టం చేశారు. మండల ఏవో కిషోర్‌బాబు ద్వారా రైతు భరోసా కేంద్రం సిబ్బంది మాగాణి రైతులను నిత్యం పర్యవేక్షించారన్నారు. ఫలితంగా వరి దుబ్బు కట్టి అధికంగా గింజ ఏర్పడిందన్నారు. ఈ నూర్పిడిలో


జి.కిషోర్‌బాబు, ఏవో

తాలు గింజ శాతం పూర్తిగా పడిపోయిందని నాణ్యమైన దిగుబడి లభించిదన్నారు. తమ కుటుంబ సభ్యులు మొత్తం కలిసి నాట్లు సమయం నుంచి కలుపు మొక్కలు తొలగించే వరకు ప్రస్తుతం నూర్పిడి వరకు అన్నీ తామే చేసుకోవడంతో వ్యవసాయ కూలీల ఖర్చు అత్యధికంగా తగ్గిపోయిందని చెప్పారు. గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

106 సైలెన్సర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లు

ఒంగోలు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా మోటారు బైకుల ఏర్పాటు చేసిన హారన్లను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో గురువారం ట్రాఫిక్ పోలీసులు నగరంలో ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించారు. అధిక శబ్దాలతో ప్రజలను చికాకు పెడుతున్న వాహనాలను నిలిపి వాహనలకు బిగించిన 106 సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఒరిజనల్ హారన్లను మాత్రమే వినియోగించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.